

సకాలంలో వైద్యసేవలందించాలి

ధర్మవరం టౌన్ : ప్రభుత్వాస్పత్రికి వివిధ జబ్బుల బారిన పడి వచ్చే రోగులను వైద్యులు ప్రేమతో పలుకరించి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సూచించారు. ఆదివారం నూతనంగా ప్రారంబించిన కాయగూరల మార్కెట్, ప్రభుత్వాస్పత్రిని ఆయన తనిఖీచేశారు. ముందుగా కాయగూరల మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే మార్కెట్లో రైతులు, వ్యాపారుల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిని తనిఖీచేశారు. ఆస్పత్రిలోని పలు వార్డుల్లో తిరుగుతూ సక్రమంగా వైద్యసేవలు అందుతున్నాయా, మందులు ఇస్తున్నారా అంటూ రోగులను అడిగితెలుసుకున్నారు. ఆస్పత్రిలో అవుట్‌సోర్సింగ్‌కింద పనిచేస్తున్న సిబ్బంది తమకు గత ఆరునెలలుగా వేతనాలు రాలేదని, దీంతో కుటుంబపోషణ భారమైందని ఎమ్మెల్యేతో వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిర్వాసితుల్లో గుబులు

జాతీయ రహదారి 544డి విస్తరణకు సిద్ధం
పరిహారంపై స్పష్టతనివ్వని అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జాతీయ రహదారి 544 డి విస్తరణకు రంగం సిద్ధమవుతున్న వేళ నిర్వాసితుల్లో గుబులు మొదలైంది. టెండరు ప్రక్రియ పూర్తయి సర్వే జరుగుతుండటంతో ఇళ్లు, భూములు కోల్పోనున్న నిర్వాసితుల్లో పరిహారం పరిస్థితి ఏమిటన్న ఆందోళన మొదలైంది. మార్కింగులు చేసుకుంటూ పోతున్న అధికారులు పరిహారం విషయమై పెదవి విప్పడం లేదు. ఎంత పరిహారం ఇస్తారన్న దానిపై స్పష్టనివ్వకపోవడంతో గుబులు రేగుతోంది. పాత అంచనాల ప్రకారం కాకుండా కొత్త విలువ ఆధారంగా పరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ రహదారి 44 నుంచి జాతీయ రహదారి 16కు అంటే అనంతపురం నుంచి విజయవాడకు రహదారి విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టింది. దీనికి 544డి గా రహదారికి నామకరణం చేశారు. వాస్తవానికి ఇది 2014లోనే మంజూరైంది. అయితే టెండరు దశ వరకూ వచ్చింది. అయితే అప్పట్లో అనంతపురం నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్డ్ అంటే పూర్తిగా కొత్త రహదారి నిర్మాణం చేపట్టే ఆలోచనతో 544డిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. 2019లో అధికారం మారక గ్రీన్‌ఫీల్డ్‌కు ప్రభుత్వం స్వస్థి పలికింది. కొత్తగా బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేను తెరపైకి తెచ్చింది. ఇది రావడంతో తిరిగి ఇప్పుడు 544డి మళ్లీ తెరపైకి ఇచ్చింది. టెండరు ప్రక్రియ కూడా పూర్తయి అనంతపురం నుంచి భోగసముద్రం వరకు 69 కిలోమీటర్ల మేర అనంతపురం జిల్లాలో రహదారి నిర్మాణం జరగనుంది. దీనికి కొంత భూసేకరణ జరగాల్సి ఉంది.

500 హెక్టార్ల భూమి అవసరం

అంతపురం నుంచి భోగసముద్రం వరకు నిర్మిస్తున్న 544డి నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి సుమారు 500 హెక్టార్ల భూమి అవసరమని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే ఉన్న భూమి కాకుండా ఇది అదనంగా అవసరమవనుంది. ఏడు మండలాలు, 34 గ్రామాల గుండా ఈ రహదారి వెలుతోంది. అనంతపురం నుంచి ముచ్చుకోట వరకు ఒక ప్యాకేజీ, అక్కడి నుంచి బోగసముద్రం వరకు రెండో ప్యాకేజీ కింద పనులు చేపడుతున్నారు. అవసరమైన 500 హెక్టార్ల భూమిలో 85.102 హెక్టార్ల భూమి ఇప్పటికే అందుబాటులో ఉంది. తక్కిన 414.898 హెక్టర్ల భూమి సేకరించాల్సి ఉంది. ఈ విస్తరణలో సుమారు 600 ఇళ్లు కూడా పోనున్నాయి. వీటి పరిహారంపైనే ఇప్పుడు ఆందోళన నడుస్తోంది.

2014 అంచనాల ప్రకారమే పరిహారం

2014 అంచనాల ప్రకారమే ఇప్పుడు పరిహారం ఇచ్చే అవకాశాలున్నట్టు అధికారులు చెబుతున్నారు. 2014లో మొదటి దఫా రహదారి మంజూరైన సమయంలోనే భూ సర్వే పూర్తయి ఉండటంతో అప్పటి భూమి విలువ ప్రకారమే ఇప్పుడూ పరిహారం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారమే జాతీయ రహదారి సంస్థ రూ.156 కోట్లను మంజూరు చేసింది. అయితే ఇప్పుడు నిర్వాసితులు మాత్రం ఇప్పటి భూమి విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

జాతీయ రహదారి కింద భూములు ఇళ్లు, కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం న్యాయంపరంగా చేయాలి. భూమి కోల్పోతున్న రైతులకు సెంటుకు కనీసం రూ.50 వేలు ఇవ్వాలి. 2023 ధరల ప్రకారం ఇళ్లకు పరిహారం చెల్లించాలి. 2013 భూసేకర చట్టం ప్రకారం పరిహారమివ్వాలి.

- వి.శివారెడ్డి, 544డి రోడ్డు నిర్వాసితుల కన్వీనర్

కార్మికులపై ఆంక్షల కత్తి..!

వారందరూ సఫాయి కార్మికులు.. వారి వద్ద అండ్రాయిడ్ సెల్ ఫోన్‌నే కాదు..అక్షర జ్ఞానం కూడా లేదు. అయినా ప్రభుత్వం మొండిగా పురపాలక సంఘాల్లో పారిశుధ్య విభాగంలో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు సెల్ ఫోన్‌లో ప్రత్యేక యాప్‌లో ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి అంటూ నిబంధనలు తీసుకొచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ ఇప్పటికే పలు రకాలుగా కార్మికులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడంతో తాడో పేడో తేల్చుకోవడానికి ఈ నెల 26 చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు.

సఫాయి కార్మికులకూ ముఖ ఆధారిత హాజరు
విరమించుకోవాలని డిమాండ్
తాడో..పేడో తేల్చుకునేందుకు 26న చలో అసెంబ్లీ



హిందూపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘాల్లో పనిచేసే పర్మినెంట్ సిబ్బందితో పాటు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికుల రోజువారీ పనికి సంబంధించిన హాజరు విధానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులతో వారి జీతాలకే గాక ఉద్యోగాలకు సైతం ప్రమాదం ఏర్పడుతోంది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు మున్సిపాలిటీలలో పని చేసే అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఇప్పటి వరకు అమలులో ఉన్న హాజరు విధానం (ఎమ్‌డి ఎస్ఆర్ఎస్) స్థానంలో కొత్త హాజరు విధానాన్ని (ఎపి ఎస్ఆర్ఎస్) తీసుకొస్తూ ప్రభుత్వం జిఒ 159 తీసుకొచ్చింది. దీన్ని గత నెల 16వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. నూతన హాజరు విధానంతో ఎవరి సెల్ ఫోన్‌లో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫొటో తీసి ప్రభుత్వ తయారు చేసిన యాప్ ద్వారా హాజరు పంపించాల్సి ఉంది. మున్సిపల్ కార్మికుల్లో అత్యధిక మందికి అక్షర జ్ఞానం లేదు. దీంతో పాటు అత్యధిక మందికి సొంత స్మార్ట్ ఫోన్లూ లేవు. ప్రభుత్వం నిర్ణయించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పంపించగల అనుభవం అసలే లేదు. అటువంటి వారితో తమ ఫొటోలు తామే తీసుకుని హాజరు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించడం కార్మికులను అన్యాయం చేయడమే. యాప్‌లో హాజరు నమోదు కాక పోతే రోజంతా పని చేసినప్పటికీ లెక్కలోకి రాదు. జీతం ఇవ్వరు. ఇలా 4 నుంచి 5 రోజులు వరుసగా హాజరు నమోదు కాకపోతే ఆ కార్మికుడిని ఉద్యోగం నుంచి తొలగించే ఆవకాశాలు ఉన్నాయి. దీంతో పండుగ, ఇతర సెలవులు సైతం అమలు కాక పోవడమే కాకుండా, కార్మికులు బానిసలుగా మారి పని చేయాల్సి ఉంటుంది. ఒప్పంద కార్మికులకు ఉరితాడులా మారుతున్న ముఖ ఆధారిత హాజరు విధానాన్ని రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అనంతపురం, హిందూపురం మున్సిపాలిటీలో సిఐటియు అధ్వర్యంలో మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు పోరాటాలు చేపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈ నెల 26న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారు. అసెంబ్లీ ముట్టడి చేయడానికి కార్మికులు సిద్ధం అవుతున్నారు.

అమలుకాని హామీలు..

గత సమ్మెలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు ప్రభుత్వం అమలు చేయలేదు. చర్చల్లో కార్మికుల కుటుంబ సభ్యులకు కూడా అమ్మ ఒడి, చేయూత, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు అమలు చేయాలని, కార్మికులకు అవసరమైన పనిముట్లు, రక్షణ పరికరాలు, భద్రతా సౌకర్యాలు సకాలంలో అందిచాలని, సాధారణంగా మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా కింద చెల్లించాలని, పర్మినెంట్ సిబ్బందికి సంబంధించి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, హెల్త్ కార్డులు, జిపిఎఫ్ అకౌంట్లు, ప్రమోషన్లు తదితర సమస్యలు పరిష్కరిస్తామని 7 నెలల క్రితం ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేయలేదు. వీటిని అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

కార్మికులు ఐక్యంగా తిప్పికొట్టాలి..



వ్రరపాలక, పంచాయతీల్లో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులు ఐక్యంగా ఎపి ఎఫ్ఆర్ఎస్ విధానంతో ఉద్యోగాలకు రాబోతున్న ప్రమాదాన్ని తిప్పి కొట్టాలి. అదే విధంగా 2022 జులై సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాటాలకు సిద్ధం కావాలి –

ఈఎస్ వెంకటేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి

ఇంత వరకు స్మార్ట్ ఫోన్ వాడలేదు..



ఇంత వరకు తాము స్మార్ట్ ఫోన్ ఉపయోగించ లేదు. అది ఎలా వాడాలో తెలీదు. అందులో హాజరు వేయమంటే ఎలా వేయాలో కూడా తెలియదు. దీనివల్ల మాకు అన్యాయం జరుగుతుంది. ఈ విధానాన్ని తక్షణమే రద్దుచేసి మునిసిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.

- ఓబుళమ్మ, కార్మికురాలు

అమలు చేస్తే అన్యాయం..



పురపాలక సంఘంలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు ముఖ ఆధారిత హాజరు విధానం అమలు చేస్తే వారికి అన్యాయం జరుగుతుంది. పారిశుధ్య విభాగంలో పనిచేసే కార్మికుల్లో చాలా మందికి స్మార్ట్ ఫోన్లు లేవు. వాటిని ఎలా వాడాలో కూడా తెలీదు. నూతన విధానంలో హాజరు పడకపోతే, విధులకు హాజరు అయినప్పటికీ ఆ రోజు వేతనం అందక ఇబ్బంది పడతారు. ఉద్యోగాలకు కూడా ప్రమాదం ఏర్పడుతుంది

– పెద్దరాజు, మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు ఇటి రామ్మూర్తి

ఉచిత మూర్ఛ వ్యాధి వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి నెల మూర్ఛవ్యాధి గ్రస్తులకు నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం ఆదివారం పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులోని ఆల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో నిర్వంచారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్. ఇటి రామ్మూర్తి 137 మంది మూర్ఛ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారందరికి ఒక నెలకు సరిపడు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూర్ఛవ్యాధి గ్రస్తులు నీరు, నిప్పు వద్ద, ఎత్తైన ప్రదేశాల్లో, యంత్రాల వద్ద సంచరించరాదన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధిని నియంత్రించ వచ్చునన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు జెవివి నాయకులు జిఆర్ శ్రీనివాసులు, రామకృష్ణ, విశ్వనాథ చారి, ఉగ్రప్ప, నాగరాజ గుప్త, మంజునాథాచారి, చంద్రశేఖర్‌రెడ్డి, అంజనరెడ్డి, అన్వర్, నరసింహులు , అబ్దుల్ హక్, పెన్నయ్య, మురళిమోహన్, ప్రభాకర్, ఉమాపతి, సుబ్రమణ్యం తదితరులు సేవలు అందించారు.

నేడు 'స్పందన' రద్దు

పుట్టపర్తి అర్బన్ : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం ఈ సోమవారం కూడా రద్దు చేస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదలైంది. పాలనాపరమైన ఇబ్బందులయ దృష్ట్యా అనివార్య కారణాలతో స్పందనను రద్దు చేసినట్లు తెలిపారు. పజలు ఈ విషయం గమనించి కలెక్టరేట్‌కు రావద్దని ప్రకటనలో కోరారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికచేయూత

పరిగి : తన చిన్ననాటి సహ విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందడంతో తోటి మిత్రులు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. మండలం కేంద్రానికి చెందిన భజంత్రీ గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.దీంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీన్ని గుర్తించిన గోపాల్‌తో పాటు పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమవంతు చేయూతను అందించారు. మృతుడి స్నేహితుడు మహమ్మద్ గౌస్ తన పాఠశాలైన అమర్ విద్యా మందిర్‌లో గోపాల్ కుమార్తె లీలావతికి ఉచిత విద్య బోధన తో పాటు విద్యార్థికి అవసరమైన అన్ని వసతులను కల్పించడానికి ముందుకు వచ్చారు. అమెరికాలో ఉద్యోగ నిర్వహిస్తున్న మరో స్నేహితుడు డాక్టర్ గురురాజు కుమారుడు కిరణ్ మృతుడి కుటుంబ అవసరాల కోసం రూ 20,000 నగదు అందజేశారు. కిరణ్ అందుబాటు లేకపోవడంతో అతని మిత్రులు సుబ్రహ్మణ్యం, మహమ్మద్ గౌస్ గోపాల్ కుటుంబసభ్యులకు నగదును అందజేశారు.



బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజలు సహకరిస్తే భూ రీసర్వే సులభతరం

జిపి.రామకృష్ణ, సత్యసాయి జిల్లా సర్వే భూములు, రికార్డు అసిస్టెంట్ డైరెక్టరు





ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ హక్కు, భూ రక్ష పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రీ సర్వేకి ప్రజలు సహకరిస్తే పనులు సులభతరం అవుతాయని సత్యసాయి జిల్లా సర్వే భూములు, రికార్డు అసిస్టెంట్ డైరెక్టర్ జిపి.రామకృష్ణ తెలిపారు. రెవెన్యూ శాఖ అంటేనే భూ తగాదాలు, రహదారులు, సాగు పట్టాలు, భూ ఆక్రమణలు తదితర సమస్యలను పరిష్కరించాలని మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారుల చుట్టూ ప్రజలు తిరుగుతూ ఉండటాన్ని నిత్యం చూస్తూ ఉంటామన్నారు. కొన్ని భూ సమస్యలు కోర్టు వరకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయన్నారు. కుటుంబంలోనే ఇద్దరు అన్నదమ్ముల మధ్య భూతగాదాలు నెలకొంటున్నాయని చెప్పారు. భూ సమస్యలపై చాలాసార్లు గొడవలు జరగటం, ఇరువర్గాలూ పోలీసులను ఆశ్రయిస్తుంటారన్నారు. ఇలాంటి భూ సమస్యలన్నీ రీ సర్వే వల్ల పరిష్కారం అవుతాయని తెలిపారు. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న : రీ సర్వే వల్ల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నారా ?

జవాబు : ప్రజలు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్నాం. 100 ఏళ్ల తర్వాత ప్రభుత్వం భూహక్కు, భూ రక్ష పథకం కింద రీ సర్వే చేపట్టింది. సర్వే రాళ్లను కూడా ప్రభుత్వం సమకూర్చుతోంది. రీ సర్వేలో శాశ్వత భూ హక్కు రైతులకు కలుగుతుంది. సర్వే కోసం డ్రోన్లు, విమానాలను సైతం ప్రభుత్వం వినియోగిస్తూ ప్రతిష్టాత్మకంగా రీ సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ప్రజలకు ఒక్క రూపాయి కూడా ఖర్చు ఉండదు. సర్వే కోసం గ్రామానికి వచ్చిన సిబ్బందికి తమకి ఉన్న భూమి పట్టాలు, పట్టా పాసు పుస్తకాలు ఇస్తే సులభంగా సర్వే చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

ప్రశ్న : రీ సర్వేలో ఎలాంటి సమస్యలు ఎదురవుతాయి ?

జవాబు : సహజంగానే గ్రామాల్లో భూ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఉదాహరణకు ఒకరి కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల్లో ఒకరు 10 సెంట్లు ఎక్కువ సాగు చేస్తుంటారు. అప్పుడు ఇద్దరూ అంగీకారానికి వస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అలాగే కొన్ని భూములు ఆక్రమణలు, అన్యాక్రాంతమై ఉంటాయి. కొన్ని కోర్టులో ఉంటాయి. అవన్నీ రీ సర్వేలో వెల్లడయ్యే అవకాశం ఉంది. వాటిని పరిష్కరించడానికి ప్రతి మండలానికి ఒక డిప్యూటీ తహశీల్దారును ప్రత్యేకంగా ప్రభుత్వం నియమించింది. వారి పరిధిలో పరిష్కారానికి కృషి చేస్తారు. జఠిలమైన సమస్యలు ఉంటే ప్రజలు అప్పీలు చేసుకోవచ్చు.

ప్రశ్న : జిల్లాలో ఎంత సాగుభూమి ఉంది. ఎన్ని గ్రామాలు ఉన్నాయి ?

జవాబు : సత్యసాయి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల భూమి ఉంది. 460 గ్రామాలు ఉన్నాయి ఇప్పటివరకు మొదటి విడతలో 26 గ్రామాల్లో రీ సర్వే కోసం 13 నోటీసులు ఇచ్చాం. సర్వే జరిగింది. రెండవ పేస్‌లో 29 గ్రామాల్లో నోటీసులు ఇచ్చాం. దశలవారీగా సర్వే పూర్తి అయిన గ్రామాల రైతులకు భూహక్కు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తాం.

ప్రశ్న : జిల్లాలో ఎప్పుడు సర్వే ప్రారంభించారు. ఎప్పటి లోపు పూర్తి కావొచ్చంటారు ?

జవాబు : ఒక ఏడాది నుంచి సర్వే పనులు చేపట్టాం. జిల్లాలో పూర్తి గ్రామాల్లో సర్వే పూర్తి కావాలంటే మరో ఐదారు సంవత్సరాలు పట్టవచ్చు. అసైన్డ్ భూములు, పూర్వపు పట్టాలు, దేవాలయ భూములు, ఇలా పలు రకాల భూములు ఉన్నాయి. నోటీసులు ఇచ్చిన గ్రామాల్లో మొదట అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి సర్వే ఉద్దేశాలను ప్రజలకు వివరిస్తాం. కాబట్టి కోర్టు పరిధిలో ఉన్న భూములు మినహాయిస్తే రైతుల దగ్గర ఉన్న ఆధారాల మేరకు సర్వే పూర్తి చేస్తాం.

ప్రశ్న : సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జవాబు : అలాంటి సమస్య లేదు. రీ సర్వేపై నెలలో రెండు సార్లు కలెక్టర్ సమీక్షిస్తారు. అవసరమైన సిబ్బందిని ప్రభుత్వం సమకూరుస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే ఇదొక బృహత్తర కార్యక్రమం. ఆయా గ్రామాల్లో ప్రజలు సర్వే అధికారులకు సహకరిస్తే సిబ్బందికి భూ రీ సర్వే సులభతరం అవుతుంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి

జగన్‌ది తుగ్లక్ పాలన : పల్లె

పుట్టపర్తి రూరల్: జగన్ పాలనలో ప్రజలు ఆనందంగా లేరని ఆయన పాలన తుగ్లక్ పాలనను తలపిస్తోందనిమాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం పుట్టపర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక చేయూత అందించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌ను పోలీసులతో అపగలరేమో కాని ప్రజల మనస్సులో నుండి చేరపలేరని అన్నారు. లోకేష్ పాదయాత్ర ను ఆపేందుకు పోలీసులను అడ్డు పెట్టుకున్నారన్నారు. చీకటి జీవోలతో రోడ్ల పై పోలీసులను పెట్టి పాదయాత్రను ఆపడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. త్వరలో ప్రజలే వైసీపీకి సమాధి కట్టే రోజులు దగ్గర పడ్డాయనీ జోస్యం చెప్పారు.

కరాటేతో ఆత్మస్థైర్యం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కరాటే వల్ల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని మల్టీస్టార్ ఆలిండియా బుడోఖాన్ కరాటే అకాడమి కరాటే మాస్టర్ ఇనాయతా బాషా పేర్కొన్నారు. స్థానిక కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నతపాఠశాల ఆవరణంలో ఆదివారం మల్టీస్టార్ ఆలిండియా బుడోఖాన్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ టెస్టులో 80 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో 65 మంది విద్యార్థులు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ బ్రౌన్ బెల్టులు సాధించారని కరాటే మాస్టర్ తెలిపారు.



కరాటే గ్రేడింగ్ టెస్టు నిర్వహిస్తున్న దృశ్యం



విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే

కశ్యప మహర్షి విగ్రహావిష్కరణ

పెనుకొండ : నగర పంచాయతీ పరిధిలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వనమూలికలు, ఆయుర్వేద పితామహుడు శ్రీకశ్యప మహర్షి విగ్రహాన్ని పున్ణ ప్రతిష్టించారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ చేతుల మీదుగా ఈ విగ్రహ ప్రతిష్టాపన జరిగింది. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు సుధాకర్ గుప్త, యాడికి నాగరాజు, సూర్యనారాయణ, వైస్ ఛైర్మన్ సునీల్, నాయకులు బాబు, గణేష్, తిమ్మారెడ్డి, యాసిన్, ఫరీద్, నరసింహులు, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ధర్మవరం టౌన్ : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని స్థానిక రేగాటిపల్లిరోడ్డు పక్కన గల కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. భక్తులు ఆదివారం అధికసంఖ్యలో తరలివచ్చి కాలభైరవుడిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా దాతలు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, భర్త కోటిరెడ్డిబాలిరెడ్డి, సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నేడు అగ్నిగుండ మహోత్సవం

అమరాపురం : ప్రసిద్ధిగాంచిన హేమావతి క్షేత్రంలో అగ్నిగుండ మహోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా మడకశిర, కళ్యాణదుర్గం డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెప్పారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు

హిందూపురం : అమరాపురం మండలం హేమావతిలో జరుగుతున్న ఉత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి 18 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ హంపన్న తెలిపారు. ఆదివారం స్థానిక డిపో కార్యాలయంలో ఆయన మాట్లాడుతు ప్రతి సంవత్సరం మహా శివరాత్రిని పురస్కరించుకుని హేమావతిలో జరిగే ఉత్సవాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ బస్సులు ఉత్సవాలు ముగిసే వరకు నడిస్తాయన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌టిసి అధికారులు రవి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ఉరవకొండ : ఉరవకొండలో ఏర్పాటు చేసిన సెపక్ తక్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప, అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ హరినాథ్, ఎన్నికల అధికారి రమేష్‌బాబు, ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా 14, 17ఏళ్ల బాల, బాలికల విభాగాలో క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా పాల్గొని విజయకేతనం ఎగురవేయాలని పిలుపునిచ్చారు. క్రీడల ద్వారా మానసిక ఎదుగుదలతో పాటు శరీర దారుఢ్యం పెరిగి మానసికోల్లాసం, స్నేహ సంబంధాలు పెంపొందించుకోవచ్చన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్రీడాకారుల సౌలభ్యం కోసం ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశామన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో పాటు పర్యవేక్షక సిబ్బందికి ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున ఉచిత భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ పోటీలు జరిగే మూడు రోజుల్లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళకు సాయం

అనంతపురం : భర్తను కోల్పోయి ముగ్గురు ఆడపిల్లలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద మహిళకు నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు వారి పుట్టినిల్లు ఆశ్రమంలో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఆదివారం నిత్యావసరాలతోపాటు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు నందమూరి నగర్‌కు చెందిన ఉషకు ముగ్గురు ఆడపిల్లలు. ఈమె భర్త బ్లడ్ క్యాన్సర్ కారణంతో 2015లో మృతి చెందాడు. దీంతో అప్పటి నుంచి ఇళ్లల్లో పనిచేస్తూ ఆమె జీవిస్తోంది. ఈనేపథ్యంలో ముగ్గురు ఆడ పిల్లలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను తెలుసుకున్న నిర్మలమురళి ఆమెను ఆదర్శనగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

బుక్కరాయసముద్రం : ఆరు లైన్ల రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని భూ నిర్వాసితుల సంఘం కన్వీనర్ వెంకటశివారెడ్డి తెలిపారు. ఈమేరకు ఆదివారం నగరంలోని ఎంపి తలారి రంగయ్య, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి స్వగృహాల్లో కలిసి బాధిత రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి 544 విస్తరణలో మండలంలోని రోటరీపురం నుంచి బుగ్గ వరకు దాదాపు 500 ఇళ్లు కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఇళ్లు కోల్పోతున్న బాధితులందరికీ 2023 ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కనీసం సెంటుకు రూ.3లక్షల ఇచ్చేందుకు కృషి చేయాలని విన్నవించారు. ఇందుకు నాయకులు స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్.నాగరాజు, కిష్ట, వేణు, రవి, లక్ష్మీనారాయణస్వామి, వెంకటేశు, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆశా సర్జికల్ క్లినిక్ ప్రారంభం

గుంతకల్లు : పట్టణంలోని 60 అడుగుల రోడ్డులో ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్.జివి.సోమయాజులు ఏర్పాటు చేసిన ఆశా సర్జికల్ క్లినిక్‌ను ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ జివి.సోమ యాజులు పట్టణ ప్రజలకు సుపరిచితుడేనన్నారు. ప్రస్తుతం పట్టణంలో జనరల్ సర్జరీ వైద్యులు లేనందున ఆయన సేవలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌ఛార్జి జివి.అనిరుధ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మ రథోత్సవం

లేపాక్షి : మండల కేంద్రంలోని దుర్గా వీరభద్ర పాపానసేశ్వర ఆలయం లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వచ్ఛందంగా అన్నదాన కార్యక్రమం, మజ్జిగ, నీరు అందించారు. ఈ కార్యక్రమం లో అర్చకులు శీనస్వామి, నరసింహ శర్మ, సునీల్ శర్మ, వైసిపి మండల కన్వీనర్ నారాయణ స్వామి, మాజీ ఎంపీపీ ఆనంద్ కుమార్, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మరథోత్సవానికి హాజరైన జనం

పెరిగిన భూ ఆక్రమణలు : సిపిఎం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలో వైసిపి నాయకుల భూ ఆక్రమణలు పేట్రేగిపోతున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, మండల కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఎమ్మెల్యే అనుచరులు రోడ్లను ఆక్రమించి పునాదులు వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యేకు అత్యంత దగ్గర బంధువైన విఆర్ఒ, బంధువులు, ప్రధాన అనుచరుడు, వారి బామ్మర్దులు రాత్రికి రాత్రే ఇందిరమ్మ కాలనీలో ఉన్న ప్లాట్ నెంబర్ 295 వెనక వైపు రోడ్డును ఆక్రమించి నాలుగు పునాదులు వేశారన్నారు. ఈ విషయాన్ని ఆధారాలతో సహా తహశీల్దార్‌కు వివరించినా ఆక్రమణదారుపై చర్యలు తీసుకోలేదన్నారు. ఎమ్మెల్యే బంధువు, అనుచరుల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయమై కాలనీవాసులు ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



డాక్టర్ మదన్‌కుమార్‌ను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అవార్డు గ్రహీతకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్యుడు డాక్టర్ సివి మదన్ కుమార్ కు భారత సేవ రత్న పురస్కారం వరించిన నేపథ్యంలో ఆయనను యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా యుటిఎఫ్ నాయకులు తాహీర్‌వలి, శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ సివి మదన్ కుమార్ కుమార్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఆనంద్, రఫీక్, మహబూబ్ బాషా, మల్లికార్జున, బ్రహ్మ, ఖాదర్‌బాషా, ఆజంబాషా, భార్గవ, రమేష్, కరుణాకర్, రమణ, శ్రీరాములు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ జీవితానికి బలాన్నిచ్చిన కథలు



మేఘనాథరెడ్డిని సన్మానిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి-అనంతపురం

రాయలసీమ పల్లె ప్రజల జీవితాల్ని, రాయలసీమ సంస్కృతిని, మట్టిపరిమల సౌందర్యాన్ని వివరిస్తూ సీమ గ్రామీణ జీవితానికి బలాన్ని ఇచ్చిన కథకుడు కెవి మేఘనాథ్‌రెడ్డి అని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోలో తరిమెల అమర్‌నాథ్ రెడ్డి అధ్యక్షతన విమలా శాంతి సాహిత్య సేవా సమితి ఆధ్వర్యంలో కెవి మేఘనాథ్ రెడ్డి రచించిన కలుకూరి గుట్ట కథలకు విమలా శాంతి కథా సాహిత్య ప్రత్యేక పురస్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత జి.వెంకటకృష్ణ మాట్లాడుతూ ఆధునిక కథా లక్షణాలు ఉన్న కథలు, రైతు కూలీలు, కింది కులాల మహిళల గురించి తెలియజేసే కథల గురించి కెవి మేఘనాథ్‌రెడ్డి ఇంకా నిర్మాణాత్మకమైన కథల రాయాలని సూచించారు. కవి డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ రాయలసీమ నేటి కథకులో కె.వి మేఘనాథ్ రెడ్డి కొత్త సంతకం అని చేశారన్నారు. ఈ కథల నిండా రాయలసీమ యాస, భాష కనిపించడంతోపాటు మానవీయ పార్శ్వం మనుషుల్ని కదిలిస్తోందన్నారు. పురస్కారాన్ని స్వీకరించిన కేవీ మేఘనాథ్‌రెడ్డి స్పందిస్తూ విమలా శాంతి కథా సాహిత్య ప్రత్యేక పురస్కారం దక్కడం సంతోషకరమన్నారు. నా ప్రాంతం.. నా నేల.. నా చుట్టూ ఉన్న జీవితాన్ని ప్రతిబింబిస్తూ కథల్ని రాశానన్నారు. అనంతరం కె.వి మేనాథరెడ్డిని ఘనంగా సన్మానించడంతోపాటు రూ.5వేల బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.శశికళ, సొంటి జయప్రకాష్, డాక్టర్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, జి.అశ్వర్థరెడ్డి, జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి హెచ్.నాగలింగయ్య, ఒంటెద్దు రామలింగారెడ్డి, టిరాజారామ్, డాక్టర్ రాధేయ, కంబదూర్ షేక్ నబీరసూల్, కొత్తపల్లి సురేష్, ఎస్ఎం.బాషా, గోవిందరాజులు, మధురశ్రీ, ఆది, ఆంధ్ర తిప్పేస్వామి, చెట్ల ఈరన్న, గోసల నారాయణస్వామి, వన్నప్ప, దాము గట్ల, హిదాయతుల్లా, దాసన్నగారి కృష్ణమూర్తి, చిలుకూరి దీవెన, తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ

ప్రజాశక్తి-ఉరవకొండ

అధిక ఫీజుల వసూలు చేస్తూ విద్యార్థులను వేధిస్తున్న పట్టణంలోని ప్రయివేట్ విద్యాసంస్థలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధార్థ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉరవకొండలో ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల పేరుతో మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం తూతూమంత్రంగా విచారణ చేపట్టి విద్యార్థులను మోసం చేస్తోందని ఆవేదన వక్తం చేశారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో ఫీజుల పేర ఒత్తిడికి గురి చేస్తుండటంతో మానసిక క్షోభలకు గురికావడంతోపాటు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఉరవకొండ పరిధిలోని ప్రవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ జీఓ 52, 53కు విరుద్ధంగా నిలువు దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రయివేట్ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు చాలామంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారని, కావున విద్యార్థులపై ఫీజుల ఒత్తిడి తీసుకురావద్దన్నారు.

ముగిసిన అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దపప్పూరు : మండల పరిధిలోని పవిత్ర పుణ్యక్షేత్రం అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శనివారం సాయంత్రం శివరాత్రి కావడంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పుణ్యక్షేత్రంలో జాగారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఇఓ సుబ్రమణ్యం, ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం భక్తులు పెన్నానదిలో స్నానాలు చేసి అశ్వర్థనారాయణ స్వామి, భవానీ భీమలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో నారాయణస్వామి ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

21న ఉచిత కంటి వైద్యశిబిరం

నార్పల : మండల కేంద్రంలోని వాల్మీకి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మరుసు భాస్కర్‌రెడ్డి, బాలనాగి, నరేష్ మిత్రబృందం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వృద్ధులకు, కంటి సమస్యలు ఉన్నవారి సౌకర్యార్థం బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలంలో కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి 'శ్రీశ్రీ'



విద్యార్థినుల నృత్యం

ప్రజాశక్తి-అనంతపురం

20వ శతాబ్దంలో తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సాయంత్రం ఆర్ట్స్ కళాశాల కామర్స్ బ్లాక్ వద్ద సాహితీ స్రవంతి నాయకులు ప్రజ్ఞాసురేష్ అధ్యక్షతన మహాకవి శ్రీశ్రీ సాహిత్య సాంస్కృతిక ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి మాట్లాడుతూ సంప్రదాయ చందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించిన విప్లవ కవి అన్నారు. అంతేగాకుండా అభ్యుదయ భావాలతో జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైతాళికుడు శ్రీశ్రీ అన్నారు. తెలుగు సాహిత్యానికి దిక్సూచిలా వెలుగొందిన కవితా సంకలనం మహా ప్రస్థానం ఆయన కవితా ప్రస్థానంలో ఓ మైలురాయి అన్నారు. విశ్రాంత తహశీల్దార్ జయరామప్ప మాట్లాడుతూ పేదల కోసం ఏర్పడిన సిద్ధాంతాలు ఏవైనా అవి నావేనంటూ చాటిచెప్పిన మహాకవి శ్రీశ్రీ అన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర మాట్లాడుతూ ఆధునిక సాహిత్యాన్ని మహా ప్రస్థానానికి ముందు, తర్వాత రెండుగా విభజించి చెప్పడంలో అతిశయోక్తి కాదన్నారు. 'మరో ప్రపంచం, మరో ప్రపంచం మహాప్రపంచం పిలిచింది' అంటూ, మహాప్రస్థానం గమ్యం కాదు గమనం లక్ష్యంగా ఉత్తేజపరిచిందన్నారు. అనంతరం పిల్లలు శ్రీశ్రీ రచించిన అనేక గీతాలకు నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్వం విజ్ఞాన కేంద్రం నాయకులు యం.యన్.టి.రాజు, కవి రియాజుద్దీన్, కుల వివక్ష వ్యతిరేక సంఘం నాయకులు నల్లప్ప, ఎస్ఎఫ్ఐ నాయకులు పరమేష్, డివైఎఫ్ఐ నాయకులు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న పురస్కార ప్రదానోత్సవ సభ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని కామర్స్ సెమినార్ హాలులో ఈనెల 21న 'స్పందన' అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్యకు జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించనున్నట్లు స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి, ఆర్ట్స్ కళాశాల తెలుగు శాఖాధిపతి బి.హేమమాలిని సంయుక్తంగా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదిగుబ్బ : మండల పరిధిలోని సంకేపల్లి పంచాయతీల గల వీరనారాయణ స్వామి పరుషలోపాల్గొన్న వ్యక్తి ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆదివారం జరిగిన జాతరలో పాల్గొన్న అశోక్ కుమార్ రెడ్డి(32) ప్రమాదవశాత్తు ఎద్దుల బండి టైర్ కింద పడి తీవ్ర గాయాల పాలయ్యారు. దీంతో అతడిని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్‌కుమార్‌రెడ్డి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హేమంత్ కుమార్ తెలిపారు. మృతునికి భార్య సుచిత్ర తో పాటు మూడు సంవత్సరాల పాప ఉంది.

పేకాట జూదరులు అరెస్టు

కదిరి అర్బన్ : పేకాట ఆడుతున్న 16 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 1,58,890 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ తమ్మిశెట్టి మధు తెలిపారు. పట్టణంలోని మోహన్ గ్రాండ్ గదిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి 16 మందిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా పట్టణ పరిధిలోని కందికుంట నారాయణమ్మ కాలనీలో ఓ నివాసములో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి 60 వేల రూపాయలు సీజ్ చేసినట్లు పట్టణ సిఐ తెలిపారు. పేకాట ఆడుతున్న వారిలో పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న వారు కూడా ఉన్నట్లు సిఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరం టౌన్ : పట్టణ సమీపంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవపురంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో 28వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఇమాములు తీవ్రంగా గాయపడ్డారు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... 28వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఇమాములు ఇందిరమ్మకాలనీ నుండి ద్విచక్రవాహనంలో పట్టణం లోకి వస్తున్నాడు. లక్ష్మీ చెన్నకేశవపురంలోని ఎస్ఆర్ పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఇమాములు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇమాములు తీవ్రంగా గాయపడగా ద్విచక్రవాహనం దెబ్బతింది. క్షతగాత్రుడిని స్థానికులు ఆటోలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికారప్రతినిధి పురుషోత్తంగౌడ్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి ఇమాములును పరామర్శించారు.

కర్నాటక మద్యం పట్టివేత

గుత్తి : మండలంలోని మార్నేంపల్లి గ్రామ మలుపు వద్ద ఆదివారం కర్నాటక మద్యం పాకెట్లను పట్టుకున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. పెద్దొడ్డి గ్రామానికి చెందిన నరేష్ కర్ణాటక చెందిన టెట్రా ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తుండగా దాడి చేసి 30 టెట్రా మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితున్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ ఆదేశించినట్లు తెలిపారు.

బాధితులకు పరామర్శ

రొద్దం : మండలంలోని శేషాపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు శ్రీనివాస్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత బాధితుడిని ఆదివారం పరామర్శించారు. చోలే మర్రి మాజీ సర్పంచ్ కుళ్లాయప్ప అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటిలో విశ్రాంతి తీసుకుంటూ అతడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, ఆంజనేయులు, కలిపి క్రిష్టప్ప, చలపతి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరనారాయణస్వామి జాతర

బత్తలపల్లి : శివరాత్రి పర్వదినం అనంతరం మరుసటి దినం మండలంలోని రామాపురం గ్రామంలో వీరనారాయణస్వామి జాతర వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సమీపంలోని చిత్రావతి నదిలోకి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లి అక్కడ ప్రత్యేకాలంకరణలు చేశారు. ఎగువ గుడి అర్చకులు కప్పుల నరేంద్ర, రామప్ప, నారప్పలు దిగువగుడి అర్చరులు కప్పల నంద, నారాయణస్వామి, నాగన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ధర్మవరం రూరల్ సిఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీహర్ష తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచి బండి సరస్వతి, ఎంపిటిసి బండి రమణమ్మ, ఉపసర్పంచి బండి సుజాత, మాజీ సర్పంచు కప్పల నారాయణస్వామి నారప్ప, లక్ష్మన్న, రామప్ప, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పుట్టపర్తి రూరల్ : వివిధ కేసుల్లో పట్టుబడి పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాలను సోమవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ బాబ్జాన్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పుట్టపర్తి డీఎస్పీ యస్వంత్, రూరల్ సిఐ జయ నాయక్ ఆధ్వర్యంలో సెబ్ అధికారుల సమక్షంలో వేలయం వేయనున్నట్లు చెప్పారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


కుందుర్పి : మండల కేంద్రంలోని కోటలో వెలసిన అతిపురాతనమైన వీరభద్ర స్వామి ఆలయానికి భక్తులు రూ.80,116 నగదును విరాళంగా అందజేశారు. కర్ణాటకలోని బెంగళూరు పట్టణానికి చెందిన గిరిజమ్మ కుమారుడు వీరేంద్ర పాటిల్, రూ.30 వేలు, చెళ్లికెరకు చెందిన కెజిఎస్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని జి.రాజేష్ రూ.50,116 నగదును అలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల ఆర్థిక సహాయ, సహకారాలతో నూతన కళ్యాణమండపం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జి.చంద్రమౌళి, కార్యదర్శి, నాగభూషణం, కోశాధికారి జి.నాగరాజ్, కమిటీ సభ్యులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శివరామిరెడ్డి దంపతుల పూజలు

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండల పరిధిలోని కొనకొండ్ల గ్రామంలో మెలసిన ఛాయా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఉమాదేవమ్మ తనయుడు, ఖోఖో సంఘం జిల్లా అధ్యక్షులు భీమ్‌రెడ్డి, గుంతకల్లు ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, శారదమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమశివునికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు.

తారకరత్న మృతి బాధాకరం

రామగిరి, హిందూపురంలో తారకరత్న చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

రామగిరి : తారకరత్న మృతి బాధాకరమని మాజీ మంత్రి పరిటాల సునీత, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్దార్థ అన్నారు. తారకరత్న మృతి విషయం తెలుసుకున్న సునీత, శ్రీరామ్, పరిటాల సిద్దార్థ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ లోని తారకరత్న ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. తారకరత్న కుటుంబ సభ్యులను పరామర్శించి.. వారికి ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ తారకరత్న పరిటాల రవి వర్ధంతికి వచ్చి మాట్లాడిన మాటలు ఇప్పటికీ మెదలుతున్నాయన్నారు. ఆయనకు తమ కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు.

నివాళులు : తారకరత్న మృతి విషయాన్ని తెలుసుకున్న రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పరిటాల స్వగ్రామం వెంకటాపురంలో పరిటాల కుటుంబ సభ్యులు, స్థానిక పంచాయతీ నాయకుల ఆధ్వర్యంలో తారకరత్న చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ధర్మవరం టౌన్ : నందమూరి తారకరత్న మృతి బాధాకరమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. తారకరత్న మృతికి వారు నివాళులు అర్పించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీనాయకులు కమతం కాటమయ్య, ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పురుషోత్తంగౌడ్, రాళ్లపల్లి షరీఫ్, గోసలశ్రీరాములు, సంగాలబాలు, తొగట అనిల్, తోటవాసుదేవ, కతినేని రాజ, బాబాఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : . పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద తారకరత్న చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తారకరత్న మృతి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డైమండ్ ఇర్ఫాన్, రాజశేఖర్ బాబు, మనోహర్ నాయుడు, మధు, విశ్వనాథ్, రాజేంద్ర నాయుడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద టిడిపి నాయకులు తారక రత్న చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్లమెంట్ కార్యదర్శి అంబికా లక్ష్మినారాయణ, నాయకులు నాగరాజు, రమేష్‌కుమార్, దుర్గా నవీన్, ఆర్ఎంఎస్ షఫీవుల్లా, చంద్రమోహన్ యాదవ్, బండారు బాలాజీ, టిడిపి నాయకులు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నందమూరి తారకరత్న చిత్ర పటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిశంకర్, రఘువీర్ చౌదరి, సాయి ప్రసాద్, జావేద్, షౌకత్, అంద్రూస్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని తనకార్యాలయంలో తారకరత్న చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సవితమ్మ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, సూర్యనారాయణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : నందమూరి తారకరత్న మృతి బాధాకరమని టిడిపి నాయకులు ఎస్ శ్రీనివాసులు, రామకృష్ణ, శ్రీనివాసులు, గాజుల చంద్రమోహన్, బోయ రాజు అన్నారు. ఆయన మృతి తీరని లోటు అని అన్నారు.

పుట్టపర్తి అర్బన్ : నందమూరి తారకరత్న మృతి బాధాకరమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం టిడిపి స్థానిక కార్యాలయంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో తారకరత్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ బెస్త చలపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు అంబులెన్స్ రమేష్, శ్రీనివాస రెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.